

ఆకివీడులో వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న పోలీసు



భీమవరం పీఎస్‌ఎం స్కూల్‌.. క్యూలైన్‌లో ఓటర్లు

ఓటేశాం !

సోమవారం జిల్లాలో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. ఆయా పోలింగ్‌ కేంద్రాల్లో ఓటు వేసిన అనంతరం ఇదిగో మేమూ ఓటేశామంటూ సిరా చుక్క చూపించారు..



నర్సయ్య అగ్రహారంలో ఓటేసిన ఎంపీ అభ్యర్థి వర్మ



అయి-భీమవరంలో కుటుంబ సభ్యులతో ఉండి అభ్యర్థి రఘురామ



తణుకులో ఓటేసిన టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి కుటుంబ సభ్యులు



పెనుగొండలో ఓటు హక్కు వినియోగించుకున్న పితాని కుటుంబం



నరసాపురంలో ఓటేసిన జనసేన అభ్యర్థి నాయకర్‌ కుటుంబ సభ్యులు






తాడేపల్లిగూడెం, భీమవరంలలో ఓటేసిన జనసేన అభ్యర్థులు బొలిశెట్టి శ్రీనివాస్‌, పులపర్తి రామాంజనేయులు



భీమవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్‌ దంపతులు



ఆగర్తిపాలెంలో ఓటేస్తున్న నిమ్మల రామానాయుడు

ఓటు..సునామీ



యలమంచిలిలో బారులు తీరిన ఓటర్లు

81.12% పోలింగ్‌

భీమవరం టౌన్‌, మే 13 : జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అంచనాలకు మించి ఓటింగ్‌ నమోదైంది. పాలకొల్లులో అత్యధిక శాతం నమోదైంది. అర్ధరాత్రి వరకు అధికారులు ఎన్నికల ప్రక్రియలోనే ఉన్నారు. చాలా నియోజకవర్గాల్లో రాత్రి 10 గంటలు దాటాక కూడా పోలింగ్‌ కొనసాగింది. జిల్లాలో కనిష్ఠంగా 78 శాతం నుంచి గరిష్ఠంగా 83 శాతం నమోదైనట్టు జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలో సగటున 81.12 శాతం నమోదైంది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే భీమవరంలో 78.42 శాతం, ఆచంట 82.79 శాతం, పాలకొల్లు-83.10 శాతం, నరసాపురం 80.28 శాతం, తణుకు 82.08 శాతం, ఉండి 82 శాతం, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 79.81 శాతం పోలింగ్‌ నమోదైంది.

ఊరూ వాడా పోటెత్తిన ఓటర్లు
ఉదయం నుంచే పోలింగ్‌ బూత్‌ల వద్ద క్యూ కట్టారు
చాలా ప్రాంతాల్లో రాత్రి పది గంటల వరకు పోలింగ్‌

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. ఓటింగ్‌ మిషన్‌లపై కసిగా బటన్‌ నొక్కారు. మాక్‌ పోలింగ్‌ జరుగుతున్న సమయంలోనే పోలింగ్‌ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సోమవారం ఓటు వేసేందుకు అంతా పోటీ పడ్డారు. మండుటెండలను సైతం లెక్క చేయలేదు. అధికార పార్టీ ఇచ్చిన సొమ్ములను లెక్క చేయలేదు. ఓటర్లలో స్పష్టమైన మార్పు కనిపించింది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రధాన పార్టీ అభ్యర్థులంతా తమ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పోలింగ్‌ బూతుల వద్ద ప్రచారం నిర్వహించారు. ఓటు ఎవరికి వేస్తారంటూ ఆరాలు తీశారు. జిల్లాలో చెదురుమదురు సంఘటనలు మినహా అన్నిచోట్ల పోలింగ్‌ ప్రశాంతంగా సాగింది.ఉదయం పోలింగ్‌ ప్రక్రియ మెల్లగా సాగింది. ఆ ప్రభావం సాయంత్రానికి కనిపించింది. పట్టణాల్లో వృద్ధులు ఎండలో గంటలతరబడి నిలబడాల్సి వచ్చింది. కొన్నిచోట్ల కనీసం టెంట్‌లు కూడా వేయలేదు. కుర్చీలు కూడా లేకపోవడంతో ఓటు వేసేంత వరకు ఓటర్లు నిలుచునే ఉన్నారు. పాఠశాలల్లోనే అత్యధికంగా పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పలు పాఠశాలల్లో ఒకే చోట మూడు పోలింగ్‌ స్టేషన్‌లను నెలకొల్పారు. దాంతో అక్కడ రద్దీ ఏర్పడింది. కనీసం మంచినీరు కూడా అందుబాటులో లేకపోయింది. తాడేపల్లిగూడెం వివేకానంద బొమ్మ వద్ద పాఠశాల వద్ద పోలింగ్‌ స్టేషన్‌లలో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.

గ్రామాల్లో జోరు

పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఓటింగ్‌ శాతం అధికంగా నమోదైంది. జిల్లాలో ఆచంట నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు ఓటు వేశారు. పట్టణ కేంద్రాలుగా ఉన్న నియోజకవర్గాల్లో మాత్రం కాస్త తక్కువగా పోలింగ్‌ జరిగింది. ఓటు ఎక్కడనేది తెలుసుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. ఒకే చోట రెండు పోలింగ్‌ స్టేషన్‌లు ఉంటే ఎక్కడకు వెళ్లాలో తెలియక అయోమయంలో పడిపోయారు. గంటల తరబడి వేచి ఉండలేక పట్టణాల్లో పెద్దలంతా ఇంటిముఖం పట్టారు. మళ్లీ ఓటింగ్‌కు రాలేదు. సాయంత్రం మాత్రం పోలింగ్‌ స్టేషన్‌ల వద్ద రద్దీ సాగింది. మండలాల్లోనే అధికంగా ఓటింగ్‌ శాతం నమోదైంది. ప్రతి మండలంలోనూ గరిష్ఠంగా 85 శాతం వరకు పోలింగ్‌ నమోదు కావడం విశేషం . కొన్ని మండలాల్లో అయితే 90 శాతానికి మించి పోలింగ్‌ జరిగింది. అదే పట్టణాల్లో మాత్రం 75 శాతం పోలింగ్‌ జరగడం గగనమైపోయింది.



సాయంత్రం 6 గంటల సమయంలో నరసాపురం 36వ బూత్‌ వద్ద బారులు తీరిన ఓటర్లు

స్వల్ప వివాదాలు మినహా అంతా ప్రశాంతం

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఘర్షణ చోటు చేసుకుంది. మిగిలిన నియోజకవర్గాల్లో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. గూడెం నియోజకవర్గంలోని అలంపురం పోలింగ్‌ స్టేషన్‌ వద్ద వైసీపీ, జనసేన వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ముందుగా వైసీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అక్కడకు వెళ్లారు. దాంతో వైసీపీ వర్గాలు హడావుడి చేశాయి. ఆయన వెళ్లిపోయిన తర్వాత కొట్టు తనయుడు విశాల్‌ పోలింగ్‌ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ చేయి పైకెత్తి జనసేన కార్యకర్తల వైపు చూపించారు. తమకు హెచ్చరికలు చేశారంటూ జనసేన కార్యకర్తలు ఎదురుగా వచ్చారు. దాంతో విశాల్‌ జనసేన కార్యకర్తలతో వాదనకు దిగారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. తాడేపల్లిగూడెం పట్టణంలోని వెంకటరత్నం ఆసుపత్రి వద్ద వైసీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ,జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌లు కేకలు వేసుకున్నారు. అక్కడున్న ఎస్‌ఐ కూడా అధికార పార్టీకి వంతపాడుతున్నారంటూ బొలిశెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండి నియోజకవర్గం పాలకోడేరు మండలంలో వైసీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. తెలుగుదేశం అభ్యర్థి రఘురామకృష్ణరాజు గొల్లలకోడేరు, పాలకోడేరు వెళ్లినప్పుడు పోలింగ్‌ కేంద్రాల వద్ద జైజగన్‌, జై పీవీఎల్‌ అంటూ వైసీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. డబ్బులు ఇవ్వకుండా ఓట్లు అడగడానికి ఎందుకు వస్తున్నారంటూ వైసీపీ కార్యకర్తలు రంకెలు వేశారు. తర్వాత రఘురామరాజు తమ కేడర్‌తో సంప్రదింపులు జరిపి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

కూటమిలో జోష్‌

ఎన్నికల సరళిని చూసి కూటమిలో జోష్‌ నెలకొంది. ప్రజలు మార్పు కోరుకున్నారని కూటమి నేతలు ఆనందంలో మునిగి తేలుతున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు తమవేనన్న ధీమా కూటమిలో నెలకొంది. పాలకొల్లు నియోజకవర్గంలో అయితే వైసీపీ అభ్యర్థి సక్రమంగా సొమ్ములు పంచలేదంటూ అదే పార్టీలో పెద్ద రచ్చసాగింది. మరోవైపు వైసీపీ కేడర్‌ పోలింగ్‌ కేంద్రాల వద్ద అంతగా కనిపించలేదు. మధ్యాహ్నం తర్వాత ఇళ్లకు వెళ్లిపోయారు. వైసీపీ అభ్యర్థులపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నియోజకవర్గాల్లో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం మచ్చుకైనా కానరాలేదు. ఓటింగ్‌ జరుగుతున్నాసరే వైసీపీ కేడర్‌ సందడి లేకుండా పోయింది. కూటమి నాయకులు, కార్యకర్తలే చివరిదాకా పోలింగ్‌ స్టేషన్‌ల వద్ద వేచి ఉన్నారు. సాయంత్రం కూడా ఓటర్లను పోలింగ్‌ స్టేషన్‌లకు తరలించారు.

వైసీపీలో డీలా

ఎన్నికలకు జనం పోటెత్తడంతో ప్రభుత్వానికి మద్దతుగానే అంతా వచ్చారంటూ అధికార పార్టీ అభ్యర్థులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి నేతలు డీలా పడిపోయారు కేడర్‌లోనూ స్పందన అంతంత మాత్రంగానే కనిపించింది. అభ్యర్థులు మాత్రమే నియోజకవర్గమంతటా పర్యటించారు. ఇతర నాయకులు ఏ ఒక్కరూ కూడా పక్క పోలింగ్‌ స్టేషన్‌కు వెళ్లిన పరిస్థితి లేదు. అదే కూటమి నాయకులైతే నియోజవర్గమంతా సుడిగాలి పర్యటన చేశారు. ఒకవైపు అభ్యర్థులు, మరోవైపు కూటమి మద్దతు దారులు గ్రామాల్లో పర్యటించి తమ కేడర్‌ను ప్రోత్సాహమందించారు. అటువంటి సందడి ఈసారి వైసీపీ అభ్యర్థుల్లో కనిపించలేదు. మధ్యాహ్నం వరకు కాస్త హడావుడి చేశారు. ఆ తర్వాత అన్ని నియోజకవర్గాల్లోనూ వైసీపీ కేడర్‌ నీరసించిపోయింది. ఓటమి తప్పదన్న భావన వారిలో తారసపిడింది.



రాయలంలో రాత్రి 8 గంటల వేళ ఓటేసేందుకు..

రాత్రి పది దాటినా.. కొనసాగిన పోలింగ్‌

భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం, ఆచంట, ఉండి నియోజకవర్గాల్లో రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కూడా పోలింగ్‌ సాగింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోనే రాత్రి 9 గంటలకు ఇంకా 49 పోలింగ్‌ స్టేషన్‌లలో ఓటింగ్‌ కొనసాగింది. అదే ఆచంటలో అయితే అతికొద్ది కేంద్రాల్లో మాత్రమే రాత్రి వరకు ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదేపరిస్థితి. ఈ సారి రాత్రి 10 గంటల వరకు ఓటింగ్‌ వేస్తూనే ఉన్నారు. ఎన్నికల అధికారులు వేగవంతంగా ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే జాప్యం జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ఆకివీడులో ఓటేసిన యువత

మార్పు కోసమేనా

తాడేపల్లిగూడెం రూరల్‌, మే 13: ఈ ఎన్నికల్లో యువత ఉత్సాహంగా ఓట్లు వేశారు. మన భవిష్యత్‌ మనమే నిర్ణయించుకోవాలనే తలంపుతో సుదూర ప్రాంతాల నుంచి కూడా ఉద్యోగాలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించి భారీగా తరలి వచ్చారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ నమోదైన ఓట్లలో యువతే ఎక్కువగా ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విదేశాల్లో ఉన్న వారు కూడా స్వగ్రామాలకు చేరుకుని ఓటుహక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో తొలిసారి ఓటు హక్కు వచ్చిన ఓటర్లు 30 వేల మంది వరకూ ఉండగా 18 నుంచి 25 సంవత్సరాల వయసు ఉన్న యువకులు లక్షా 25 వేల వరకూ ఉన్నారు. వారంతా ఈసారి మార్పు కోరుకుని ఓటు వేసేందుకు బారులు తీరారు.



పరిశీలిస్తున్న కలెక్టర్‌ సుమిత్‌, ఎస్పీ అజిత

స్ట్రాంగ్‌ రూమ్‌ల పరిశీలన

భీమవరం టౌన్‌, మే 13 : డాక్టర్‌ బీవీ రాజు కళాశాలలో ఆచంట, తణుకు, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్‌ రూమ్‌లు, కౌంటింగ్‌ కేంద్రాలు, రిసెప్షన్‌ సెంటర్లను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి కలెక్టర్‌ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పోలింగ్‌ ముగిసిన తర్వాత నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి వారికి కేటాయించిన స్ట్రాంగ్‌ రూమ్‌ దగ్గర ఉన్న రిసెప్షన్‌ సెంటర్లకు అప్పజెప్పాలని, ఆర్వో సూచనల మేరకు భద్రపరచాలన్నారు. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఎస్‌ఆర్‌కేఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో భద్రపరచనున్నట్లు తెలిపారు. భీమవరం పట్టణ పరిధిలోని 99, 137 పోలింగ్‌ స్టేషన్‌లను పరిశీలించారు.

ఎస్పీ పోలింగ్‌ కేంద్రాల తనిఖీ

భీమవరం క్రైం, మే 13 : భీమవరం నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రమైన చినఅమిరం పోలింగ్‌ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ అజిత సోమవారం తనిఖీ చేశారు. పోలింగ్‌ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీతోపాటు భీమవరం టూటౌన్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఓటుకు నోటు ఇవ్వలేదని ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్‌, మే 13 : ఓటుకు నోటు పంపిణీ చేయలేదని తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు కొత్త కాలనీలో ఓటర్లు ఆందోళనకు దిగారు. నిన్న అర్ధరాత్రి నుంచి పంపిణీ చేస్తామని ఊరిస్తూ వచ్చిన వైసీపీ నాయకులు పోలింగ్‌ రోజు ఉదయం కూడా ఇవ్వకపోవడంతో కాలనీలోని వైసీపీ నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఇవ్వడానికి తెచ్చిన సొమ్ములు నాయకులు కాజేశారని తాము ఓట్లు వేయమంటూ భీష్మించారు. దీంతో సొమ్ములు పంచుతామని చెప్పి సుమారు 3 గంటలపాటు లైన్‌లో నిలబెట్టారు. చివరకు డబ్బులు రాలేదని చేతులెత్తేయడంతో స్థానికులంతా చేసేదేమీ లేక పోలింగ్‌ కేంద్రాలకు తరలి వెళ్లారు.

రూ.100తో సరిపెడతారా !

పాలకొల్లు, మే 13 : పాలకొల్లు నియోజకవర్గంలో ఓటుకు నోటు పంపిణీలో చిత్ర విచిత్రాలు చూపించిన అధికార పార్టీ శ్రేణులను ఎన్నిక ప్రక్రియ పూర్తయిన తర్వాత దుర్భాషలాడుతున్నారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థి తరఫున గ్రామాల్లో ఒకలా, పట్టణంలో మరో విధంగా సొమ్ములు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో ఓటుకు రూ.1500 ఇవ్వగా మరి కొన్ని గ్రామాల్లో రూ.1000 ఇచ్చారు. అదే సమయంలో పేద వర్గాలు, గట్టిగా అడగలేని ఓటర్లకు రూ.100 ఇచ్చి సరిపెట్టారు. వేరే ప్రాంతాల నుంచి తెచ్చుకున్న వ్యక్తులతో సొమ్ములు పంపిణీ చేయిస్తే ఇలాగే ఉంటుందని స్థానిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీరిచ్చే ముష్టి 100 రూపాయలకు ఏమొస్తాయంటూ ఓ మహిళ దుమ్మెత్తి పోసింది.



కొండ్రుప్రోలులో సొమ్ముల కోసం క్యూలైన్‌లో స్థానికులు


ఎన్ఆర్ఐ ఓటు



ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం బాధ్యతగా భావించి అమెరికా నుంచి వచ్చి ఓటు వినియోగించుకున్నట్లు తణుకులోని సజ్జాపురం ప్రాంతానికి చెందిన బత్తుల హరిప్రియ తెలిపారు.



తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లికి చెందిన అత్తంటి చందు అమెరికా నుంచి 4 రోజుల క్రితమే వచ్చారు. ఓటుహక్కును వినియోగించుకున్నారు.



అమెరికాలోని మిచిగాన్ నుంచి వచ్చిన దుగ్గిరాల మునేశ్వరరావు తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ఓటు వేశారు.



మలేషియాలో ఉంటున్న యలమంచిలి గ్రామానికి చెందిన బోళ్ళ ప్రసాద్ స్వగ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తనతో పాటు 40 మంది సెలవుపై వచ్చామన్నారు.

తొలి ఓటు



భీమడోలులో తొలిసారి ఓటు పొందిన యువతులు



బుట్టాయగూడెంలో తొలిసారి ఓటు వేసిన యువతులు





ఏలూరులోని పోలింగ్ కేంద్రంలో వేచివున్న, తొలిసారి ఓటు వేసిన యువతుల సందడి













ఆకివీడు, ఆగిరిపల్లి, ముదినేపల్లి, ఉండి మండలాల్లో తొలిసారి ఓటు వినియోగించుకున్న యువత ఉత్సాహం



పోలవరం మండలం గూటాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు



నరసాపురంలో సాయంత్రం వేళ రద్దీ



ఏలూరు కేపీడీటీ పాఠశాల పోలింగ్ బూత్ వద్ద బారులుతీరిన ఓటర్లు

ఓటెత్తారు

సార్వత్రిక ఎన్నికల్లో అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. తొలిసారి ఓటు హక్కు పొందిన యువతీ యువకులు ఓటు వేయడానికి ఉత్సాహం చూపారు. వృద్ధులు, అనారోగ్యంతో నడవలేని వారు సైతం సహాయకులతో పోలింగ్ బూత్‌కు చేరుకుని ఓటు వేశారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నప్పటికీ పోలింగ్ బూత్‌లు కిటకిటలాడాయి.



ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లిలో క్యూలైన్‌లో కింద కూర్చున్న మహిళా ఓటర్లు



ఉండి జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఓటర్లను క్యూలైన్‌లో కుర్చీలో కూర్చున్న ఓటర్లు





దెందులూరు మండలం మసీదుపాడు పోలింగ్ బూత్‌లో మహిళా ఓటర్లు, ఓటు వేసిన అనంతరం బంధువుల సెల్ఫీ



ఆచంట వేమవరం పోలింగ్ స్టేషన్‌కు బెలూన్ల అలంకరణ



చంటి బిడ్డతో ఓటేస్తున్న మహిళ



ఆకివీడులో చిన్నారుల సాయంతో ఓటేసి వస్తున్న వృద్ధులు













ద్వారకా తిరుమల, భీమవరం మండలాలు, ఏలూరు నగరం, కొయ్యలగూడెం, ఆకివీడు, భీమడోలు, ఆకివీడు మండలాల్లో వృద్ధాప్యం, అనారోగ్యం, వైకల్యం అధిగమించి బంధువుల సహాయం ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు











ఎన్నికల విధుల్లో ఎన్‌సీసీ కేడెట్లు సైతం..



ఏలూరు ఎడ్యుకేషన్, మే 13: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కెడెట్లు ఉమ్మడి జిల్లా పోలింగ్ కేంద్రాల్లో సేవలందించారని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సౌరబ్ ముఖర్జీ సోమవారం తెలిపారు. ఎన్‌సీసీ శిక్షణలో భాగంగా జాతీయ కార్యకలాపాల్లో కేడెట్లు స్వచ్ఛంద సేవలందించాల్సి ఉంటుందని వివరించారు. ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు కేడెట్లను ఎన్నికల విధులకు పంపించామన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి, వృద్ధులు, దివ్యాంగుల కేడెట్ల సేవలను వినియోగించుకున్నట్టు వివరించారు. 25 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి ఎన్‌సీసీ కేడెట్లు పోలింగ్ కేంద్రాల్లో సేవలందించారన్నారు. వీరందరికీ ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు.

ఓటు వేయడానికి వెళుతూ మృతి

ఏలూరు క్రైం, మే 13 : స్వగ్రామంలో ఓటు వేయడానికి వెళుతూ ఒక యువకుడు మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని రాయపేట భూపతి వెంకటరాజు వీధికి చెందిన మాచిరెడ్డి శ్రీమహావిష్ణు (34) హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి బయలుదేరిన శ్రీమహావిష్ణు విజయవాడ వరకు వచ్చానని, ఏదో ఒక రైలులో వస్తానని తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. మార్గమధ్యలో ఏలూరులోని గిలకలగేటు సమీపంలో రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ఓటేసి గుండెపోటుతో మృతి..

గణపవరం, మే 13: కోమర్రులో పంపన దానమ్మ (75) ఓటు వేసి అనంతరం గుండెపోటుతో మృతి చెందింది. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసిన అనంతరం పంపన ధానమ్మ బయట స్కూల్ గోడ వద్ద కుప్పకులి గుండెపోటుతో చనిపోయింది.

చింతపర్రులో..

పాలకొల్లు రూరల్, మే 13: ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధురాలు ఇంటికి రాగానే గుండెపోటుతో మరణించిన సంఘటన చింతపర్రులో సోమవరం చోటుచేసుకుంది. తానేటి నాగమణి (68) ఉదయం ఓటేసి ఇంటికి వెళ్లిన కొద్ది నిమిషాలకే గుండెపోటు రావడంతో మృతి చెందింది.

యనమదుర్రులో..

యనమదుర్రు డేగాపురం ప్రాంతంలోని సువర్ణరాజు (71) పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చి గుండెపోటుతో మృతి చెందాడు. సువర్ణరాజు గుండె వ్యాధికి చికిత్స చేయించుకున్నట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కుక్కునూరు, మే 13: కుక్కునూరు మండలం వెలేరు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాగంటి నవకాంత్ (39) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడు నవకాంత్ భద్రాచలం నుంచి కుక్కునూరులోని తన సొంత గ్రామం ముత్యాలమ్మపాడు గ్రామానికి కారులో వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా జామాయిల్ కర్ర లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ముత్యాలంపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

యర్రంపేటలో మహిళ హత్య

కొయ్యలగూడెం, మే 13: యర్రంపేటలో ఒక మహిళ హత్యకు గురైంది. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన సోదెం అరుణ(32) మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన దారం రాంబాబు ఈ సంఘటనకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. అక్రమ సంబంధం వలనే ఈ సంఘటన జరిగినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

వ్యక్తిగత కక్షతో వ్యక్తి హత్య

కలిదిండి, మే 13: పోతుమర్రు గ్రామం గొల్లగూడెంకు చెందిన చిల్లిముంత ముత్యాలు (50)ను వ్యక్తిగత కక్షల నేపథ్యంలో వరసకు మేనల్లుడు కట్టా సత్యనారాయణ ఆదివారం పొడిచాడు. చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కైకలూరు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఓటు వెయ్యబోమని నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఓటు వేసేది లేదు..!

వంకబొత్తప్పగూడెం గిరిజనుల నిరసన

గ్రామాన్ని ఐటీడీఏ పరిధిలో చేర్చాలని డిమాండ్

నచ్చజెప్పి ఓటు వేయించిన అధికారులు

కొయ్యలగూడెం, మే 13: మండలంలో 7 గిరిజన గ్రామాలను ఐటీడీఏ పరిధిలోకి చేర్చాలని కోరుతూ గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. సుమారు 2 గంటల పాటు తాము ఓటుహక్కు వినియోగించుకోమని భీష్మించారు. గతంలో కూడా ఈ గ్రామంలో ఇదేవిధంగా ఓటర్లు నిరసన తెలిపారు. అధికారులు నచ్చజెప్పడంతో తిరిగి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా గిరిజనులు నిరసనలు తెలిపారు. తాము ఐటీడీఏ పరిధిలో లేకపోవడం వలన అన్ని విధాల నష్టపోతున్నామని వాపోయారు. ఎన్నిసార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్న ఫలితం లేకపోవడంతో తామంతా ఓట్లు వెయ్యకుండా నిరసన తెలుపుతున్నామన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెంలో ఆకులు కప్పుకున్న ఓటర్లు

ఓటర్లకు ఎండ దెబ్బ...

అత్తిలి/తాడేపల్లిగూడెం రూరల్, మే 13 : అత్తిలి బాలుర ప్రాథమిక పాఠశాలలో 2 పోలింగ్ బూత్‌లకు వెళ్ళేందుకు ఒకే గుమ్మం ఉండడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్తిలి బాలికల ఉన్నత పాఠశాలలో ఓటర్లకు నామమాత్రంగా టెంట్లు సదుపాయం కల్పించారు. కొందరు ఎండలో నిలబడాల్సి వచ్చింది. అక్కడ మంచి నీటి సదుపాయం కూడా లేదని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేచోట రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, సూచిక బోర్డులు లేకపోవడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. అలాగే తాడేపల్లిగూడెంలో కూడా ఓటర్లు ఎండవేడికి ఇబ్బంది పడ్డారు. ఎండలోనే బారుతీరి నిల్చొన్నారు. పెంటపాడు పరిమెళ్ళలో ఒక మహిళ క్యూలైన్‌లో ఎక్కువ సేపు నిలబడి నీరసంతో పడిపోయింది.


భీమవరంలో ఎండలో నిలబడిన ఓటర్లు


పెంటపాడు మండలం పరిమెళ్ళలో ఓటు వేసేందుకు క్యూలైన్లో నిలబడి అస్వస్థతకు గురైన మహిళ

కేపీ పాలెం పోలింగ్ కేంద్రంలో వివాదం


ఎన్నికల అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు

మొగల్తూరు, మే 13 : కేపీపాలెం సౌత్ పంచాయతీ పరిధిలోని 149వ పోలింగ్ కేంద్రంలో చివరి సమయంలో వివాదం నెలకొంది. పోలింగ్ నెమ్మదిగా సాగడంతో అదే గ్రామంలో మూడు కేంద్రాల్లో ఓటర్లు సాయంత్రం ఆరు గంటల వరకూ బారులు తీరారు. అదే సమయంలో వైసీపీ నాయకులు ఎజెంట్‌గా లేకున్నా పోలింగ్ కేంద్రంలోకి వెళ్ళడంతో గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. ఆ సమయంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు చేరుకుని విషయం తెలుసుకున్నారు. నరసాపురం ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అచ్యుత్ అంబరీష్‌కి ఈ విషయం తెలిపారు. ఎమ్మెల్యే ప్రసాదరాజు 149వ పోలింగ్ కేంద్రానికి వచ్చిన తరువాత పోలీస్ సిబ్బంది ఓటర్లను ఇబ్బందికి గురిచేస్తున్నారంటూ మాధవ నాయుడు ఆరోపించారు. దీంతో పోలీసులు మాధవ నాయుడుతో చర్చించి సామరస్యంగా పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కేపీ పాలెం, రామన్నపాలెం, కొత్తోట, ముత్యాలపల్లి పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకూ ఓటు వేస్తూనే ఉన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఓటర్లు క్యూలైన్‌లో నిలబడి ఓట్లు వేశారు. మండలంలోని కృష్ణాయపాలెంలో ఉదయం మాక్ పోలింగ్ సజావుగానే సాగినా ఓటింగ్ మొదలు పెట్టగానే ఈవీఎం కొద్దిసేపు మొరాయించింది. పలు చోట్ల వైసీపీ శ్రేణులు కూటమి నాయకులను కవ్వించే యత్నం చేయడంతో కొమ్ముగూడెం, మారంపల్లి గ్రామాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పోలీసులు నాయకులను చెదరగొట్టడంతో పరిస్థితి చక్కబడింది. పట్టణంలో కోడే వెంకట్రావు ఆసుపత్రి వద్ద పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ పోలింగ్ కేంద్రం వద్దే కూర్చోవడంతో కూటమి నాయకులు అభ్యంతరం చెప్పినా పోలీసులు స్పందించకపోవడంతో కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పోలింగ్ కేంద్రానికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తమ జన సైనికులను రెచ్చగొట్టి వారంతా రౌడీలని చిత్రీకరించేందుకే ఈ చర్యలకు పాల్పడుతున్నారని బొలిశెట్టి ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

ప్రజలు మార్పును కోరుకున్నారు: రఘురామ

ఆకివీడు, మే 13: సీఎం జగన్ చేపట్టిన ఆరాచకాలతో ప్రజలు విసిగిపోవడంతో మార్పును కోరుకున్నారని ఉండి టీడీపీ కూటమి అభ్యర్థి కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. సొంత గ్రామం అయి భీమవరంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు సద్వినియోగం చేసుకున్నారు. కనివిని ఎరగని రీతిలో ఓటర్లు ఉదయాన్నే బారులు తీరారు. కష్టాన్ని ఓర్చుకొని బస్సు ట్రైన్లు టిక్కెట్లు దొరక్కపోయినా దూరప్రాంతాల నుంచి జనం వచ్చి ఓట్లు వేశారని అన్నారు. ఆకాంక్ష, అంచనాలకు మించి విజయం దిశగా కూటమి దూసుకుపోతుందన్నారు. ఉద్యోగుల ఓటింగ్ శాతం కూడా కూటమికి పడడంతో ఈ రాష్ట్రంలో సునామి రాబోతుందని, 150 పై చిలుకు స్థానాలతో కూటమి కైవసం చేసుకుంటుందన్నారు. పార్లమెంట్‌లో 23 స్థానాల్లో విజయం సాధిస్తుందని అన్నారు.

రాత్రి పది దాటినా కొనసాగిన పోలింగ్


ఆకివీడులో భారీగా చేరుకున్న ఓటర్లు

భీమవరం రూరల్, మే 13 : భీమవరం మండలంలోని రాయలం, దిరుసుమర్రు, అనాకోడేరు గ్రామాలలోని కొన్ని పోలింగ్ బూత్‌లలో రాత్రి 8గంటల వరకు పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. పోలింగ్ సమయం 6గంటలకు కూడా ఆ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలో ఉండటంతో పోలింగ్ కొనసాగించాల్సి వచ్చింది. దిరుసుమర్రు గ్రామంలోని పోలింగ్ నెంబరు 204లో ఈవీఎం మధ్యాహ్నామే మొరాయించడంతో దానికి బదులుగా భీమవరం నుంచి మరొక ఈవీఎంను తెచ్చి ఏర్పాటు చేయడం ఆలస్యం అవ్వడంతో అక్కడ పోలింగ్ రాత్రి 10గంటలు దాటే అవకాశం ఉంటుందనే అంచనా వేస్తున్నారు.

పెనుగొండ: పెనుగొండ మండలంలోని కొన్ని గ్రామాల్లో రాత్రి సుమారు తొమ్మిది గంటలు వరకు కూడా పోలింగ్ జరుగుతూనే ఉంది. 6 గంటల తరువాత క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. దేవ గ్రామంలో 71వ బూత్‌లో కొద్ది సేపు ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు కొంత అసహనానికి లోనయ్యారు.

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని కొన్నికేంద్రాలలో ఈవీఎంలో సమస్యతో రాత్రి 7.30 గంటలు వరకూ పోలింగ్ జరుగుతోంది. ఇప్పటికే సుమారుగా 83శాతం పోలింగ్ నమోదు అయినట్టు సమాచారం. బిఆర్ఎంవీఎం హైస్కూల్, ఎంఎంకెఎస్ఎం హైస్కూల్, బ్రాడీపేట ఏవీఎస్ఎన్ఎం హైస్కూల్, మరి కొన్నిబూత్‌లో పోలింగ్ జరుగుతోంది.




పోడూరులో బారులు తీరిన ఓటర్లు.. భీమవరం రూరల్‌లో బారులు తీరిన మహిళలు.. భీమవరం పట్టణంలో ఒక పోలింగ్ కేంద్రం వద్ద మహిళలు

పోటెత్తిన ఓటర్లు

భారీ క్యూలైన్లు... గంటల సమయం.. పలు చోట్ల ఈవీఎంల మొరాయింపు

కొన్ని చోట్ల రాత్రి తొమ్మిది గంటల వరకు పోలింగ్

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు రూరల్, మే13 : ఓటు వేయడానికి ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుందనే ఆందోళనతో వృద్ధులతో సహా, మహిళలు పెద్ద ఎత్తున ఉదయం పూటనే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని 118వ పోలింగ్ కేంద్రంలో కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించాయి. వెంటనే వచ్చిన ఇంజనీర్లు సరిచేయడంతో సుమారు 40 నిమిషాలు పోలింగ్ ఆలస్యంగా మొదలయ్యింది. మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామ జోగయ్య బంగారు వారి చెరువుగట్టు ప్రాంతంలోని 91వ పోలింగ్ బూత్‌లో తొలి ఓటు వేసిన వెంటనే ఈవీఎం మొరాయించింది. వైసీపీ అభ్యర్థి గుడాల గోపి పట్టణంలోని యాళ్ళవాని గరువులోని సెంట్ మేరీస్ స్కూల్లో ఓటు వేశారు. అనంతరం బ్రాడీపేట, జర్నలిస్ట్ కాలనీ, భవన్స్, బిఆర్ఎంవిఎం హైస్కూల్, హౌసింగ్ బోర్డు తదితర ప్రాంతాల్లోని పలు బూత్‌లను సందర్శించారు. టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల పలు వార్డుల్లోని బూత్‌లను సందర్శించారు. ఎంపీ అభ్యర్థులు శ్రీనివాస వర్మ, గూడూరి ఉమా బాల పలు బూత్‌ల్లో ఓటింగ్ సరళిని సమీక్షించారు. టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు పూలపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు, భార్య, కుమార్తెలతో కలిసి ఆగర్తిపాలెం గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. దాత డాక్టర్ కలిదిండి విజయకుమార్ రాజు తన తాత కలిదిండి రామ లింగరాజు జ్ఞాపకార్థం 4వ వార్డులకు సంబంధించి 6 పోలింగ్ స్టేషన్లలో ఓటు వేసేందుకు వచ్చేవారికి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.

భీమవరం రూరల్: భీమవరం మండలంలో ఎండ తీవ్రత ఉన్నా మధ్యాహ్న సమయంలో కూడా ఓటర్లు ఓట్లు వేయడానికి వెనుకంజ వేయలేదు. ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగస్తులు, ఇతర ప్రాంతాల నుంచి బంధువులు ఎన్నడూ లేని విధంగా రావడంతో గ్రామాలలో ఓట్లు వేసేవారి సంఖ్య ఎక్కువగానే కనిపించింది. వైసీపీ, కూటమి పార్టీ కార్యకర్తలు కూడా వారి గుర్తులకే ఓటు వేయాలని ఓటర్లకు చెప్పే ప్రయత్నాలు సాగించారు. ఓటర్లుకు ఎండ తీవ్రత లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ల వద్ద మంచినీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు.

కార్యకర్తల మధ్య వాగ్వాదం..

యమునాపల్లి, దొంగపిండి గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, కూటమి పార్టీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల క్యూలైన్ల వద్దకు వస్తున్నారని, ఓటర్లతో మాట్లాడుతున్నారని కూటమి పార్టీ కార్యకర్తలు వైసీపీ కార్యకర్తలతో వాగ్వాదానికి దిగారు. పోలీస్ సిబ్బంది కలుగ చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

పోడూరు: పోడూరు మండలంలో అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. అక్కడక్కడా ఈవీఎంలు పనితీరు స్లోగా ఉండటంతో ఓటర్లు ఎక్కువ సేపు క్యూలైన్‌లలో నిలబడవలసి వచ్చింది. అనేక చోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు.

నరసాపురం/ నరసాపురం రూరల్: నరసాపురంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ 80.23 శాతం నమోదు అయింది. ఎండలకు భయటపడి చాలా మంది ఉదయం 6 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అయితే ఈవీఎంలు కొన్ని చోట్ల మోరాయించడం, నెమ్మిదిగా పని చేయడం ఉదయం 10గంటలకు కనీసం 20శాతం పోలింగ్ కూడా నమోదు కాలేదు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు రెండు నుంచి మూడు గంటల సమయం పట్టింది. తీర గ్రామాలైన బియ్యపుతిప్ప, వేములదీవి ఈస్ట్, వెస్ట్, చినలంక, తూర్పుతాళ్ళు, పీఎంలంక గ్రామాల్లో ఇదే పరిస్థితి. గంటల తరబడి నిరీక్షించాల్సి రావాడంతో చాల మంది సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మధ్యాహ్నం నుంచి పోలింగ్ కొద్దిగా స్పీడ్ అందుకుంది.

ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

బరిలో ఉన్న జనసేన అభ్యర్థి నాయకర్ 15వార్డు, ముదునూరి ప్రసాదరాజు 16వ బూత్, మాజీ శాసన మండలి చైర్మన్ షరీఫ్ బాలికల పాఠశాలలో, రుస్తుంబాదా లోని హైస్కూల్‌లో కొత్తపల్లి సుబ్బారాయుడు, కొత్తపల్లి జానకీరామ్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మహిళా కళాశాలలో, కొవ్వలి నాయుడు టేలర్‌స్కూల్‌లో, పొత్తూరి రామరాజు మిషన్‌హైస్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.

ఆచంట: ఆచంట నియోజకవర్గంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లతో కిక్కిరిశాయి. ప్రారంభంలోనే కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో కొన్ని చోట్ల పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి పెనుగొండలో తన ఓటును వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తూర్పుపాలెంలోని తన ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నెక్కంటి సతీష్ ఆచంటలో తన ఓటును సద్వినియోగించుకున్నారు. ఆచంట నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటలకు 72.40 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో కూడా ప్రశాంతంగా ఎన్నికలు జరిగినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంటెద్దు స్వామి నాయుడు తెలిపారు. ఎన్నిక పక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసినప్పటికి నియోజకవర్గంలో అనేక మంది ఓటర్లు ఆయా పోలింగ్ స్టేషన్‌లకు పెద్ద ఎత్తున రావడంతో ఆరు గంటలకు వచ్చిన వారందరిని అధికారులకు ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వడంతో సాయంత్రం అవడంతో ఆయా పోలింగ్ కేంద్రాలు వద్ద విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బంది లేకుండా చేశారు. సాయంత్రం 7 గంటలకు 76.46 శాతం నమోదు అయ్యింది. మొత్తం లక్షా 80వేల 17 ఓట్లుకు గాను 7 గంటలకు 66 వేల 450 మంది మహిళలు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. అయితే ఇంకా కొన్ని చోట్ల పోలింగ్ జరుగుతూనే ఉంది.

కొడమంచిలిలో తోపులాట

కొడమంచిలిలో కొంత సేపు వైసీపీ, టీడీపీ కార్యకర్తలు మధ్య తోపులాటకు దారి తీసింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు పోలింగ్ కేంద్రంవద్ద ఇరు పార్టీలు కార్యకర్తలు మా నాయకుడు గొప్ప.. మా నాయకుడు గొప్ప. అనుకున్న తరుణంలో వీరి మధ్య తోపులాటకు దారి తీసింది. డీఎస్‌పీ మురళీకృష్ణ సంఘటనా స్థలానికి వచ్చి ఇరు పార్టీల మూకలను చెదరగొట్టారు.

మొగల్తూరు: మండలంలో 58 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొగల్తూరు ఉన్నత పాఠశాల, నంబర్ వన్ పాఠశాల, కొత్తోట గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. కొత్తోటలో సాయంత్రం 6 గంటలకు సుమారు 500 మంది ఓటర్లు బారులు తీరి ఉండటంతో వారికి టోకెన్‌లు ఇచ్చి పోలింగ్ చేయించారు. పలు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరు 106వ పోలింగ్ కేంద్రంలో సర్పంచ్ పడవల మేరీ తొలిఓటు వినియోగించుకోగా, మొగల్తూరు 104వ పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి దివంగత యు.వి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి ఓటు హక్కు వినియోగించున్నారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రసాదరాజు సందర్శించి ఓటర్లును కలుసుకున్నారు.

పాలకోడేరు: పాలకోడేరు మండలంలో 14గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో కొన్ని గ్రామాల్లో ఉదయం ఈవీఎంలు కొంత మొరాయించటంతో ఓటింగ్ మందకొడిగా సాగింది. వాతావరణం కూడా అనుకూలించటంతో పాటు ప్రభుత్వం పై వ్యతిరేకత ఓటర్లలో ఉండటంతో అన్ని గ్రామాల్లో కూడా ఓటింగ్ శాతం పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఓటును వినియోగించుకున్నారు. పాలకోడేరు, గొల్లలకోడేరు, శృంగవృక్షం, పెన్నాడ, మొగళ్ళు, కోరుకల్లు తదితర గ్రామాల్లో ఉదయం నుంచే ఓటేసేందుకు ఓటర్లు బారులు తీరారు. రాత్రి వరకు పోలింగ్ జరుగుతూనే ఉంది.

తణుకు: తణుకు నియోజకవర్గంలో ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేల్పూరులో కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణతులసి దంపతులతో పాటు కుమారుడు నిఖిల్ రత్న, ఆరిమిల్లి తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే వైసీపీ అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అత్తిలిలో కుటుంబీకులతో కలసి ఓటేశారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తణుకులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రారంభమైన కొద్ది సేపటికి మండపాక, పైడిపర్రులోని ఈవీఎంలు మొరాయించాయి. దీంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. దీంతో సాయంత్రం గంటపాటు పొడిగించి అందరు ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. మండపాక పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఓటర్లు ఎండలోనే రోడ్డు మీద నిలబడి ఇబ్బందులు పడ్డారు. చాలా సేపట తర్వాత టెంట్‌లు ఏర్పాటు చేశారు.

82.08 శాతం ఓటింగ్ నమోదు

తణుకు నియోజకవర్గంలో ఏడు గంటల వరకు సాగిన పోలింగ్ 82.08 శాతం నమోదైంది. నియోజకవర్గంలోని 2 లక్షల 34 వేల 575 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,92,594 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉండి: ఉండి మండలంలో పలుచోట్ల ఈవీఎంలు సరిగా పనిచేయకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఒక పక్క మండుటెండ, మరొక పక్క ఉక్కపోతలతో ఓటర్లు అవస్థలు పడ్డారు. ఉండి, యండగండి, చెరుకువాడ, పెదపుల్లేరు, వాండ్రం, కోలమూరు, ఎన్ఆర్‌పిఅగ్రహారం, కలిగొట్ల, పాందువ్వ, పాములపర్రు, వెలివర్రు తదితర గ్రామాలలో పోలింగ్ ప్రశాంతంగానే జరిగింది. ప్రత్యేక అధికారులు గస్తీ తిరుగుతూ ఎన్నికల బాధ్యతలను నిర్వహించారు. మండలంలోని ఉండి, ఉప్పరగుడెంలలో నూతన ఓటర్లు తమ ఓటును వేసి ఆనందంను వ్యక్తం చేశారు. ఎన్నికల వేళ ఎమ్మెల్యే అభ్యర్థులు పోలింగ్‌స్టేషన్‌ల వద్దకు వెళ్లి ఓటింగ్ పోలింగ్ విధానాన్ని పరిశీలించారు. పోలింగ్ అధికారులను ఆరా తీశారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు కాళ్ల, ఉండిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఉండిలోని 69, పలు కేంద్రాలలోని పోలింగ్ కేంద్రాలకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు విచ్చేసి అధికారులను ఆరా తీశారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు దంపతులు స్వగ్రామమైన కలువపూడిలో ఓటును వేశారు. టీడీపీ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు స్వగ్రామమైన ఆకివీడు మండలం ఐభీమరంలో ఓటు వేశారు. రఘురామరాజు సతీమణి రమాదేవి, కుమారుడు భరత్‌వర్మ, కుమార్తె ఇందిరా ప్రియదర్శిని ఐభీమవరంలో ఓటును వేశారు. ఉండి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెన్మెత్స వెంకటలక్ష్మీ నరసింహరాజు దంపతులు ఉండి మండలం యండగండిలోని స్వగ్రామంలో ఓటును వేశారు. ఉండి పార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అరుణకుమారి దంపతులు కాళ్ల మండలం కలువపూడిలో ఓటును వేశారు.

యలమంచిలి: మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 56,999 ఓటర్లకుగానూ సోమవారం రాత్రి 9 గంటల వరకూ 47,148 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 82.71శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దారు విజయశ్రీ తెలిపారు. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో అధికసంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. యలమంచిలిలో పోలింగ్‌బూత్‌కు వెళ్లే ఓటర్లకు స్థానికులు సుమారు 3000 మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. బాడవ, కట్టుపాలెం, కొంతేరు, పెనుమర్రు, కనకాయలంక, అడవిపాలెం, కాజ పడమర, ఏనుగువానిలంక, యలమంచిలి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోనూ సాయంత్రం ఆరుగంటలకు ఓటర్లు క్యూలో ఉండటంతో పోలింగ్ కొనసాగించారు. రాత్రి 9గంటల తరువాత పెనుమర్రు, కట్టుపాలెం, కాజ పడమర, ఏనుగువానిలంక గ్రామాల్లో పోలింగ్ కొనసాగుతోంది.


ఇరగవరంలో పోటెత్తిన ఓటర్లు


మొగల్తూరులో ఓటు వేసిన దివంగత కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి

ఇరగవరం: మండలంలోని కావలిపురం, పేకేరు గ్రామాల్లో సర్వర్ సమస్యలతో ఓటింగ్ ఆలస్యంగా జరిగింది. ఈ నేపథ్యంలో ఓటేసేవారు ఎండ వేడిమి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కె. ఇల్లిందలపర్రు గ్రామంలో పోలింగ్ కేంద్రానికి సమీపంలోనే టీడీపీ నాయకులు ఉంటున్నారంటూ వైసీపీ నాయకులు ఘర్షణకు దిగడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు.

పెంటపాడు: మండలంలో చెదురుమదురు ఘటనలు మినహా మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. దీంతో మండలంలోని చాలా గ్రామాల్లో రాత్రి 8 గంటలు దాటినా పోలింగ్ జరుగుతూనే ఉంది. ఈవీఎంలు పొద్దై గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చినా ఓటర్లు ఓపిగ్గా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని వెళ్ళారు. మండలంలోని అలంపురం గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించేందుకు వచ్చిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ క్యూలైన్లో ఓటు వేసేందుకు నిలుచుని ఉన్న మహిళలతో ఓటు గురించి మాట్లాడుతుండటంతో అక్కడే ఉన్న జనసైనికులు అడ్డుకున్నారు. దీంతో కొట్టుతో పాటూ ఆయన కుమారుడు విశాల్ అక్కడే ఉన్న వైసీపీ నాయకులకు, కూటమి కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణగా మారింది. డీఎస్పీ మూర్తి సంఘటనా స్థలానికి వచ్చారు. పోలీసులు సకాలంలో స్పందించడంతో వివాదం సద్దు మణిగింది. పరిమెళ్ళలో 7 గంటలు దాటినా తమకు ఓటు వేసే అవకాశం ఇవ్వడం లేదని మగవారినే ఎక్కువగా పంపుతున్నారంటూ క్యూలైన్లో నించుని ఉన్న మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

భీమవరం టౌన్: ఓటు హక్కు వనియోగించుకోవడానికి ఉదయం ఏడు గంటల నుంచే పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఓటు హక్కు వినియోగానికి గంటల తరబడి నిలబడి క్యూలైన్‌లో నిలబడ్డారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువ ఓటర్లు ఓటు వేసినట్టుగా సెల్ఫీలు దిగారు. ఉదయం కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో వెంటనే వాటిని సరిచేశారు. సాయంత్రం ఆరు గంటలకు పలు పోలింగ్ బూత్‌లలో ఓటు వేసేందుకు రావడంతో, అధికారులు వారికి స్లిప్‌లు ఇచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు.

ఆకివీడు: మండలంలో కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాలు చిన్నవిగా ఉండడంతో పాటు సర్వర్ల సమస్యతో ఓటింగ్ ఆలస్యం జరిగింది. దీంతో ఎండలో నిలిచి ఉన్న ఓటర్లు అగచాట్లు పడ్డారు. కొన్నిచోట్ల వీల్‌చైర్లు, బారికేడ్లు లేకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని ఆరవై ఆరు పోలింగ్ బూత్‌లకు సంబంధించి చినకాపవరం, పెదకాపవరం, గుమ్మలూరు, కుప్పనపూడి ఆకివీడు జిల్లా పరిషత్ బాలురు, బాలికల ఉన్నత ప్రాథశాలలతో పాటు శివాలయం, ఈస్టుపాలెంల్లో ఎంపీపీ పాఠశాలలతో పాటు మరికొన్నిచోట్ల సాయంత్రం ఆరు గంటలు దాటిన ఓటర్లు బారులు తీరారు.




ఉండిలో ఓటర్లతో మాట్లాడుతున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు.. ఉండిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేజీ ప్రవీణ్ ఆదిత్య.. పెంటపాడులో పోలింగ్ కేంద్రం వద్ద వలవల బాబ్జి





భీమవరంలో ఓటు వేసిన తోట సీతారామలక్ష్మి.. నరసాపురంలో ఓటు వేసిన పొత్తూరి రామరాజు.. కొత్తపల్లి సుబ్బారాయుడు, జానకీరామ్.. మాజీ ఎమ్మెల్సీ షరీఫ్.. భీమవరంలో ఓటు వేసిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు




కొడమంచిలిలో వైసీపీ-టీడీపీ కార్యకర్తల మధ్య వివాదం.. పాలకొల్లులో పోలింగ్ బూత్ వద్ద మజ్జిగ పంపిణీ.. మండపాకలో ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు